క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



తెనాలిఅర్బన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ప్రముఖ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి పురస్కరించుకుని ఆంధ్ర ప్రదేశ్ బీసీ నవచైతన్య సేవా సంఘం అధ్యక్షులు మేడిబోయిన గంగాయాదవ్ ఆధ్వర్యంలో గురువారం రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆరాధ్యుల శివయాదవ్, కరేటి రవి, వెంకటేశ్వరరావు, దానబోయిన వెంకటనరసయ్య, భీష్మ పాములు, పి.యలమంద, రమణ, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ



తెనాలిఅర్బన్: మైకా మినిస్ట్రీస్ చైర్మన్ పాముల రవికుమారి జన్మదినం పురస్కరించుకుని కొల్లిపర మండలం సిరిపురంలోని అబాడెంట్ లెప్రసీ హాస్పిటల్‌లోని కుష్ఠు రోగులకు గురువారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాముల జేస్టిస్, పి.రిచార్డ్, అనూష, లెప్రసీ సూపర్‌వైజర్ జంగం శ్యామ్, పి.రజిని, పోతురాజు, నాగరాజు, శ్యామ్‌ప్రసాద్, మాధురి, రూత్ నాగేశ్వరి, సువార్త, తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుగ్గిరాల మండలం చిలువూరు స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 45–50 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి రైలు కింద పడి గురువారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోందని పోలీసులు తెలిపారు. మృతుడు తెల్ల బనియన్, నల్ల లుంగీ ధరించి ఉన్నాడు.

ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోండి



దంతలూరు(కొల్లిపర): దంతలూరు గ్రామంలో ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి హమీ మండల టెక్నికల్ అసిస్టెంట్ ఎం.రవి అన్నారు. గురువారం మండలంలోని దంతలూరు గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి కూలీకి పనులు ఉన్నాయని అన్నారు. వీటిని 600 మందికి సరిపడా పనులు కల్పించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కనపర్తి సాగర్, గ్రామ ఉపాధి వేతన దారులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో అగ్ని ప్రమాదం



తెనాలి: పట్టణ శివారు బుర్రిపాలెం రోడ్డులోని మున్సిపల్ డంపింగ్ యార్డులో గురువారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. యార్డులోని మిషనరీకి నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. ఒక్కసారిగా మంటలు, భారీగా పొగలు కమ్ముకోవటంతో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. సమీపంలోని అపార్టుమెంట్లలో నివసించే ప్రజలు రోడ్లపైకి వచ్చారు. ఫైరింజనుకు సమాచారం ఇచ్చినప్పటికీ అందుబాటులో లేకపోవటంతో వారంతా ఆందోళనకు గురయ్యారు. సమాచారం తెలిసిన మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఇతర అధికారులు అక్కడకు చేరుకున్నారు. మున్సిపల్ వాటర్ ట్యాంకులను రప్పించి మంటలు అదుపునకు ప్రయత్నించారు. మంటలు ఆగినా పొగలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ఫైరింజన్ వచ్చాక పూర్తిగా పొగలు అదుపు కాగలవని చెప్పారు.

ఘనంగా ఈదుల్ ఫిత్ర్ పర్వదిన వేడుకలు

- చెంచుపేట ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు
- ఇమామ్ ముఫ్తీ షేక్ అసద్ ఆధ్వర్యంలో నమాజు
- నమాజులో పాల్గొన్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



తెనాలి చెంచుపేట ఈద్గాలో ప్రార్థనల్లో ముస్లిం సోదరులు



నమాజు చేయిస్తున్న ఇమామ్ ముఫ్తీ షేక్ అసద్

తెనాలి: పవిత్రమైన ఈదుల్ ఫిత్ర్ పర్వదిన వేడుకలు గురువారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణ పరిధిలోని ముస్లింలు చెంచుపేట ఈద్గా మైదానంలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఉదయాన్నే నూతన వస్త్రాలను ధరించి, సంప్రదాయం ప్రకారం సేమియా పాయసం, ఖర్జూరాన్ని ఆరగించారు. పరిమళభరిత అత్తరును రాసుకుని, తలపై టోపీలు ధరించారు. 'అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్' అనే స్తోత్రాన్ని పఠిస్తూ చెంచుపేటలోని ఈద్గా మైదానానికి చేరుకున్నారు. అక్కడ మారీసుపేట అబూబకర్ మసీదు ఇమామ్ ముఫ్తీ షేక్ అసద్ ఆధ్వర్యంలో నమాజు చేశారు. అనంతరం పరస్పరం 'ఈద్ ముబారక్' శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం పక్కనే గల ముస్లిం శ్మశానవాటికకు వెళ్లి పెద్దల సమాధులపై పూలు చల్లి నివాళులర్పించారు. ఎండ వేడి అధికంగా ఉండటంతో ఈ సారి ఉదయం 9.30 గంటలకే నమాజ్ చేశారు. ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో చేసిన భారీ ఏర్పాట్లు సౌకర్యవంతంగా ఉన్నాయి. నమాజుకు ముందు వజూ కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను వినియోగించుకున్నారు.

ఈద్ నమాజులో ఎమ్మెల్యే శివకుమార్

స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ నమాజులో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈద్గా ఎదురుగా ప్రత్యేక టెంట్‌లో జనసేన, టీడీపీ, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ ప్రార్థన ముగించుకుని వస్తున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈద్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ గౌస్, కార్యదర్శి బాబు, కోశాధికారి షేక్ సలీం, ఉపాధ్యక్షుడు షేక్ జానీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పలు చోట్ల ఈద్ నమాజులు

అదే విధంగా పట్టణంలో పలుచోట్ల ఈద్ నమాజులు చేశారు. చినరావూరు ఈద్గాలో కమిటీ అధ్యక్షుడు షేక్ వలీ పర్యవేక్షణలో హాఫిజ్ షేక్ అహ్మద్ అలీ ఆధ్వర్యంలో నమాజు చేశారు. పినపాడులో ఈద్గా కమిటీ అధ్యక్షుడు బాబావలి పర్యవేక్షణలో మౌలానా మొహమ్మద్ హసన్, వహాబ్‌రోడ్డులోని మదీనా మసీదులో ముఫ్తీ ఉస్మాన్‌సాహెబ్ ఆధ్వర్యంలో, ఇస్లాంపేటలోని మర్కజ్ మసీదులో మౌలానా అబ్దుల్లా నేతృత్వంలో, పాండురంగపేటలోని మక్కా మసీదులో మౌలానా ఇమ్రాన్ ఆధ్వర్యంలో, మారీసుపేటలోని నబవీ మసీదులో ముఫ్తీ షాహిద్ ఆధ్వర్యంలో ఈద్ నమాజులు జరిగాయి. పట్టణ పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు.

వాటార్ బాటిల్స్, రస్నా పంపిణీ

తెనాలిఅర్బన్: రంజాన్ పండుగ పురస్కరించుకుని చెంచుపేటలోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన ప్రార్థనలకు హాజరైన ముస్లింలకు వహీద్ ఆధ్వర్యంలో 10 వేల వాటర్ బాటిల్స్ గురువారం పంపిణీ చేశారు. అలాగే షాహీర్ అలీ జ్ఞాపకార్థం అతని తండ్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోల్డ్ రహీమా ఆధ్వర్యంలో చెంచుపేటలోని ఈద్గా వద్ద రస్నా పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



మసీదు వద్ద వాటార్ బాటిల్ పంపిణీ చేస్తున్న వహీద్



రస్నా పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గోల్డ్ రహీమా

అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: కరోనా విపత్తును తట్టుకుని జన జీవన స్రవంతిలో మనందరం ఉన్నామంటే ఆ అల్లా కరుణ కటాక్షాలే కారణమని, అల్లా ఇచ్చిన జీవితాన్ని పది మందికి ఉపయోగపడేలా చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. రంజాన్ పర్వదినం రోజైన గురువారం స్థానిక చెంచుపేటలోని ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ముస్లింల నుద్దేశించి మాట్లాడారు. నియోజకవర్గంలోని పలు మసీదుల్లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొని, తాను కూడా అల్లా దీవెనెలను అందుకున్నానని చెప్పారు. నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు తన ద్వారా అంతో ఇంతో మేలు చేసే భాగ్యం కల్పించినందుకు అల్లాకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. గత అయిదేళ్లలో సాధ్యమైనంత వరకు అందరికీ అందుబాటులో ఉంటూ ప్రభుత్వం ద్వారా సమాజంలోని చిన్న చిన్న కుటుంబాలను ఆదుకునే ప్రయత్నం చేసినట్టు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రాబోయే రోజుల్లో మరింతగా మేలు చేసేందుకు కృషి చేయగలనని అన్నారు. గతంలో హామీ ఇచ్చినట్టుగా షాదీఖానా ఏర్పాటుకు రెండెకరాల స్థలం త్వరలోనే కేటాయించి, ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తానని అన్నారు. రాబోయే రోజుల్లోనూ ఆ అల్లా ఆశీస్సులు మనందరిపై ఉండాలని కోరుకుంటున్నాని చెప్పారు.

నందివెలుగులో ఎన్నికల ప్రచారం



తెనాలిటౌన్: మండలంలోని నందివెలుగు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చేస్తున్న ఎన్నికల ప్రచారం గురువారం ఆరవ రోజుకు చేరింది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు సత్యనారాయణ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావాలని ఈ సందర్భంగా సత్యనారాయణ అన్నారు. మే 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌లను గెలిపించాలని కోరారు. ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయి శ్రీనివాసరావు, సర్పంచ్ ధూళిపాళ్ళ పవన్‌కుమార్, గ్రామ కన్వీనర్ కానుగోలు సురేష్, నాయకులు బొంతు నరేంద్రరెడ్డి, వేముల మహేష్, కమాదుల స్వామి, బెజ్జం బాజీ, కసుకుర్తి దానియేలు, గొర్రె వెంటేశ్వరరావు, తోటకూర వసంత రావు, శాంతిరాజు, నవనీతం నాగేశ్వరరావు, వట్టిప్రోలు అశోక్, అరుణరావు, జోసఫ్, రాజు, చంటి, జడ్సన్, అశోక్ బ్రదర్స్, రంజిత్, పాదిలి శ్రీనివాసరావు, ఎర్రగుంట్ల రవీంద్రబాబు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

తెనాలిరూరల్: ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సీజ్ చేశారు. తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో కొల్లిపర మండలంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని గుర్తించి సీజ్ చేసి కొల్లిపర పోలీసులకు అప్పగించారు.

బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

పూలే జయంతి కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు



పూలే విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే శివకుమార్, పార్టీ నేతలు

తెనాలి: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మ జ్యోతిబా పూలే నిరంతరం శ్రమించారని పార్టీ నేతలు స్మరించుకున్నారు. పూలే ఆశయాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు తీసుకెళుతోందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ, ఆయా వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తుండటం గొప్ప విషయమన్నారు. ముఖ్యమంత్రి ఆదర్శంగా స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ బీసీ వర్గాలకు అండగా ఉంటున్నారని కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, పార్టీ నేతలు పెదలంక వెంకటేశ్వరరావు, కుర్రా శ్రీను, మల్లెబోయిన రాము, మునిపల్లి వంశీ, కోలా వాసు, తట్టుకూళ్ల అశోక్‌యాదవ్, కాళిదాసు సత్యం, శానంపూడి రఘురామిరెడ్డి, కె.ముక్తేశ్వరరావు, పెద్ద సుబాని, కందుల వేణువర్ధన్ పాల్గొన్నారు.

పూలే ఆశయాలను ముందుకు తీసుకువెళ్లండి

తెనాలిఅర్బన్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడిన మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం అందరిపై ఉందని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు అక్కిదాసు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. పూలే జయంతి పురస్కరించుకుని రైల్వేస్టేషన్ రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పులు తేవడానికి ఆయన చేసిన కృషి మరువరానిదన్నారు. రాజకీయ నాయకులందరూ ఆయన స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ అధ్యక్షులు జూపల్లి వంశి, కుర్రా యశ్వంత్, ఎరుకల ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ శంకరరావు, కందుల వేణువర్ధన్, జె.నాగమోహన్, లంక శ్రీరాములు, చుండూరు గోపి, ఉన్నవ సల్మాన్, నల్లగండ్ల రవిచంద్ర, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో...

జ్యోతిబాపూలే చూపిన బాట ఆచరణీయం

తెనాలి: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, అంటరానితనాన్ని రూపు మాపేందుకు అవిశ్రాంతంగా కృషి చేసిన సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే చూపిన బాట అందరికీ ఆచరణీయమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు అన్నారు. మహాత్మా పూలే జయంతిని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జ్యోతిబా జీవిత విశేషాలను స్మరించుకున్నారు. సంఘం పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను, జొన్నాదుల రాహుల్, నిడుబ్రోలు సుబ్రహ్మణ్యం, కడలి సాయి, బంగారు పోతురాజు, జొన్నాదుల రమేష్, జొన్నాదుల మురళి, వెంకట శివ కళ్యాణి, తిరువీధుల ఈశ్వరికుమారి పాల్గొన్నారు.



బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

బాధ్యతలు చేపట్టిన భారత్ వికాస్ పరిషత్ నూతన కార్యవర్గం



ప్రమాణస్వీకారం చేసిన నూతన కార్యవర్గం

తెనాలి: జాతీయ సాంస్కృతిక సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ భారత్ వికాస్ పరిషత్ 2024–25 సంవత్సర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక హోటల్ సామ్రాట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వీహెచ్‌పీ ప్రసాద్, పాలకవర్గంలోని ఇతర సభ్యులు పీబీవీ రమేష్‌బాబు, దీపక్ జైన్, గోపాలం శ్రీనివాసరావు, అంచా లక్ష్మీ తులసి, భాస్కరుని శ్రీనివాసరావు, గొడవర్తి సాయి హరేరామ్, చుండూరు చంద్రశేఖర శ్రీనివాస్, తాడికొండ వెంకటరమణతో సహా మరో 8 మంది సభ్యులు ప్రమాణం చేశారు. 1963లో ఢిల్లీలో డాక్టర్ సూరజ్ ప్రకాష్‌చే స్థాపించిన భారత వికాస్ పరిషత్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వికలాంగ సహాయక పునరావాస యోజన, గ్రామ బస్తీ వికాస్ యోజన, వనవాసి కళ్యాణ యోజన, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య, నేత్ర పరిరక్షణ, నేత్రదానం, సాక్షరత అభియాన్, ప్రకృతి వైపరీత్యాలకు గురైన వారిని ఆదుకోవటం, సామూహిక సరళ వివాహాలు వంటివి పరిషత్ కార్యాక్రమాలుగా నిర్వాహకులు వివరించారు. సేవా దృక్పథం కలిగిన వారు భారత్ వికాస్ పరిషత్‌లో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. భారత్ వికాస్ పరిషత్ సౌత్ రీజియన్ సెక్రటరీ డి.పురుషోత్తమశాస్త్రిని సత్కరించారు. ప్రియదర్శిని గ్రూప్ విద్యా సంస్థల అధినేత చందు రామారావు, ఆర్ఎస్ఎస్ ప్రాంత్ సోషల్ మీడియా ప్రముఖ్ అవ్వారు శ్రీనివాసరావు, చుండూరు సాయి పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



తెనాలిరూరల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎన్నికల సమయంలో అలజడులు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని వన్‌టౌన్ సీఐ జి.దశరథరామారావు హెచ్చరించారు. తెనాలి వన్‌టౌన్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు గురువారం సాయంత్రం పట్టణంలోని శివాజీచౌక్, గాంధీచౌక్, బోస్‌రోడ్డు, చినరావూరు తోట, రామలింగేశ్వరపేట, డిపో సెంటర్, నాజరుపేటలో రూట్ మార్చ్ నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా సీఐ అన్నారు. అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రజలు ఎన్నికల్లో ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు భద్రత మీ వెంటే ఉంటుందన్న నమ్మకం కల్పించేందుకు అన్ని ప్రాంతాల్లో రూట్ మార్చ్ నిర్వహిస్తున్నటుట్ తెలిపారు.

షెడ్డు నిర్మాణానికి రూ.2.50 లక్షల విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు నగదు చెక్కు అందజేస్తున్న మదనగోపాల్ రెడ్డి దంపతులు

ప్రత్తిపాడు: అంకమ్మ తల్లి ఆలయంలో షెడ్డు నిర్మాణానికి దాత అదనంగా మరో రూ. 2.50 లక్షల విరాళాన్ని అందించారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో నూతనంగా పునర్నిర్మిస్తున్న అంకమ్మ గుడి ఆవరణలో భక్తుల సౌకర్యార్థం 1500 చదరపు అడుగుల విస్తీర్ణంలో షెడ్డును నిర్మిస్తున్నారు. షెడ్డు నిర్మాణానికి పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా చేస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రత్తిపాడు వాసి బాపతు మదన గోపాల్‌రెడ్డి, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయినిగా చేస్తున్న రుద్రమదేవి దంపతులు గత నెల రూ.5 లక్షలు విరాళమిచ్చారు. గురువారం మరో రూ. 2.50 లక్షల నగదు చెక్కును ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు బాపతు సాంబశివారెడ్డికి అందజేశారు. తన తల్లిదండ్రులు బాపతు చెన్నారెడ్డి, నాగరత్నమ్మల జ్ఞాపకార్థం షెడ్డు నిర్మాణం నిమిత్తం రూ.7.50లక్షలను ఆలయానికి విరాళమిచ్చినట్లు మదనగోపాల్ రెడ్డి తెలిపారు. గంగిరెడ్డి నాగమల్లేశ్వరి, మురళీధర్‌రెడ్డి, రజిని, నాగరాజు, బాపతు శ్రీనివాసరెడ్డి, గుండ్లకుంట రామాంజనేయ రెడ్డి, చిన్నపురెడ్డి చిన అంజిరెడ్డి, వెంకటరత్నం, కమిటీ సభ్యులు ఉన్నారు.

పార్కిన్సన్స్‌పై అవగాహన అవసరం

సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ విజయ, పక్కన పలువురు వైద్యులు

గుంటూరు మెడికల్: భారత దేశంలో చాలావేగంగా పార్కిన్సన్స్ వ్యాధి పెరుగుతున్న దృష్ట్యా ప్రతిఒక్కరు వ్యాధిపై అవగాహన కల్గి ఉండాలని సీనియర్ న్యూరాలజిస్ట్, లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పటల్ న్యూరో సైన్సెస్ డిపార్ట్‌మెంట్ చీఫ్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. వరల్డ్ పార్కిన్సన్స్ డీసీజ్ అవేర్‌నెస్ డే ను పురస్కరించుకుని గురువారం స్థానిక కొత్తపేటలోని లలితా హాస్పటల్‌లో అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో డాక్టర్ విజయ మాట్లాడుతూ నరాల సంబంధిత రుగ్మతల్లో పార్కిన్సన్ వ్యాధి వల్ల చాలా తీవ్రమైన ఇబ్బందులు రోగులు ఎదుర్కొంటారని తెలిపారు. ఈ వ్యాధికి నేడు అత్యాధునిక డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్(డీబీఎస్) అనే అత్యాధునిక ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. త్వరలోనే తమ ఆస్పత్రిలో ఈ ఆపరేషన్లు ప్రారంభిస్తామని న్యూరోసర్జన్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. తొలుత పార్కిన్సన్స్ బాధితుల కోసం డాక్టర్ విజయ ప్రత్యేకంగా ఓపీని ప్రారంభించారు. డాక్టర్ బి.ఉషాకిరణ్, డాక్టర్ వై.రామచంద్ర, డాక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొని రోగులు, వారి సహాయకుల సందేహాలను నివృత్తి చేశారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: బాలికను పెళ్లి చేసుకుంటానన్ని మోసం చేసిన యువకుడిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరానికి చెందిన పి.సాయికిరణ్‌రెడ్డి మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి కొద్ది రోజుల క్రితం తన వెంట తీసుకువెళ్లాడు. బాలికను పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడు. చివరకు పెళ్ళికి నిరాకరించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు.

నేత్రపర్వంగా ప్రతిష్టా మహోత్సవాలు

ప్రత్తిపాడు: అంకమ్మతల్లి ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు గురువారం నిత్యపూజ, క్షీరాధివాసం, వాస్తు పూజ, పంచామృతాదివాసం, సుగంధ ద్రవ్య స్వప్నం, సముద్రోధక అభిషేకం, ఆదివాసం హోమం, మధ్యాహ్నం నవగ్రహ ఆరాధన, సాయంత్రం ప్రధాన కలశవాహన సాలీర్చన, రాత్రి క్షీరతర్పణం, న్యాసకళ, అంగ, ప్రత్యంగ, అధివాస, ధాన్య, పుష్ప వస్త్రాధివాసములను అత్యంత వేడుకగా నిర్వహించారు. దాన్యాధివాసానికి గ్రామస్తులు తమ ఇంటి నుంచి ధాన్యాన్ని సమర్పించారు. అనంతరం దర్బార్ సేవ, వేద పారాయణం జరిగాయి. యజ్ఞయాగాదులు, హోమాలను చేశారు.

తనిఖీల్లో రూ.1.08లక్షలు స్వాధీనం

గుంటూరుఈస్ట్: సరైన పత్రాలు లేకుండా ఓ వ్యక్తి నగదు తీసుకువెళ్తుండగా కొత్తపేట పోలీసులు నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట కుగ్లర్ హాస్పటల్ సమీపంలో గురువారం ఫ్లెయింగ్ స్క్వాడ్ కె.జితేంద్ర అనే వ్యక్తిని తనిఖీ చేశారు. అతని వద్ద ఎటువంటి పత్రాలు లేకుండా తీసుకెళుతున్న రూ.1,08,800లు ఉన్నాయి. పోలీసులు నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో కేఎల్‌యూ విద్యార్థుల విజయబావుట

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు గ్రూప్–2 ప్రిలిమ్స్ ఫలితాల్లో విజయ బావుటా ఎగురవేసినట్లు గురువారం వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో బీఏ (ఐఎఎస్) కోర్సులో చదివిన జనరల్ నాలెడ్జ్, సిశాట్‌లు తమ విద్యార్థుల విజయానికి ఎంతగానో దోహదం చేశాయన్నారు. బీఏ (ఐఎఎస్) విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసిన సుమారు 60 తరగతుల కరెంట్ అఫైర్స్ విజ్ఞానం వారి విజయానికి దోహదపడిందని, విద్యార్థులందరికీ ప్రతిరోజు ఇంగ్లిష్ పేపర్ ఇచ్చి విశ్లేషణ చేయించడం, ప్రతి విద్యార్థిని ప్రధాన సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలను ఉచితం అందించడం, 365 రోజులు లైబ్రరీ అందుబాటులో ఉంచడంతో ఈ విజయం సాధించినట్లు వీసీ డాక్టర్ జి.పార్థసారధి ఆ ప్రకటనలో తెలిపారు.